రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

గణపురం/ రేగొండ, జూలై 1 : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం గణపురం మండలకేంద్రం లోని రైతు వేదిక, చెల్పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్లు గండ్ర సత్యనారాయణ రెడ్డి, కన్నెబోయిన కుమార్‌యాదవ్, రేగొండ మండలకేంద్రంలోని రైతు వేదికలో పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు ఆధ్యక్షతన నిర్వహించిన రైతుబరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తాము సాగు చేస్తూ పంటలు పండిస్తున్న భూములకు మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా అందించాలని మండలం లోని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నారన్నారు. రైతు భరోసా పక్కదారి పట్టకుండా రైతుల అభిప్రాయం తెలుసుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీడు భూములకు, రియల్ ఎస్టేట్ భూములకు రైతు భరోసా అందించమన్నారు. రైతులు వరి ధాన్యం సన్న రకం సాగు చేయడం వల్ల ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, డీసీవో శైలజ, సహకార సంఘం వైస్ చైర్మన్లు కావాటి రవీందర్, సిరిగినేని బాబురావు, ఎంపీటీసీలు మోటపోతుల శివశంకర్ గౌడ్, పొనగంటి సుధర్మ మలహలరావు, ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీ విజయ, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఉమేశ్‌గౌడ్, నర్సయ్య పాల్గొన్నారు.

వరికి క్వింటాల్‌కు రూ.3 వేలు చెల్లించాలి

గోవిందరావుపేట : రైతులు పండించిన వరి ధాన్యానికి క్వింటాకు రూ.3 వేల మద్దతు ధరను ప్రభుత్వం అందించాలని రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని రైతువేదిక భవనంలో పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి అధ్యక్షతన రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా సహకార అధికారి ఎం సర్దార్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రైతు భరోసా ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ. 7500 చెల్లించాలని, రూ.3 వేల మద్దతు ధర రైతులతో పాటు ఎలాంటి షరతులు లేకుండా కౌలు రైతులకు సైతం వర్తింపజేయాలని, 5 ఎకరాలు కలిగిన రైతులందరికీ రైతుబంధు వర్తింపజేయాలని ఎక్కువ మంది రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు సాంబయ్య, సదానందం, సాంబలక్ష్మి, మాధవ రెడ్డి, సీఈవో తిరుపతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, జూలై 1 : సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ఆరు శాఖల అధికారులు గ్రామ స్థాయిలో ప్రజల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలు వేయాలని తెలిపారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో వంటలు వండే వారు పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. జూలై, ఆగస్టులో నీరు కలుషితమై డయేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలిన గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్నిరకాల అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో మధుసూదన్, డీపీవో నారాయణరావు, డీఆర్డీవో నారాయణరావు, సంక్షేమ అధికారి అవంతిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డీఈవో రాజేందర్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

4 నుంచి సంపూర్ణత అభియాన్..

ములుగురూరల్, జూలై 1 : నీతి అయోగ్ సూచించిన ఆరు అంశాలను గిరిజనులకు అందించేందుకు ఈ నెల 4 నుంచి కన్నాయిగూడెం మండలంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కార్యక్రమ అమలు కోసం అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నీతి అయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌లో భాగంగా వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు వ్యవసాయ శాఖ ద్వారా భూ సార పరీక్షలు చేసి రైతులకు భూ పరీక్ష కార్డులను అందించాలన్నారు. మహిళా సంఘాలకు రుణాలు అందించేందుకు అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని మండల అధికారులు విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఏటూరునాగారం ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, జూలై 1 : ఏటూరునాగారం ఏఎస్పీగా శివం ఉపాధ్యాయను నియమిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శివం ఉపాధ్యాయ గ్రేహౌండ్స్ కమాండర్‌గా పనిచేస్తున్నారు. అక్కడ నుంచి ఏటూరునాగారం ఏఎస్పీగా బదిలీ చేశారు. కాగా, ఇక్కడ ఏఎస్పీగా పనిచేస్తున్న గీతే మహేశ్ బాబా సాహెబ్‌ను ములుగు ఓఎస్డీగా బదిలీ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

గిరిజన దర్బార్‌లో 66 దరఖాస్తులు

ఏటూరునాగారం, జూలై 1: గిరిజన దర్బార్‌లో వచ్చిన అర్జీలను వారం రోజుల్లో పరిష్కరించేలా అధికారులు పని చేయాలని ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా ఆదేశించారు. సోమవారం ఐటీడీఏలో గిరిజన దర్బార్ నిర్వహించారు. సుమారు 66 మంది దరఖాస్తులను పీవోకు అందజేశారు. పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించాలని, సీఆర్టీలుగా నియమించాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు, చెక్ డ్యాం లు, మైనర్ రిపేర్ల బిల్లులు చెల్లించాలని, ఏఎన్ఎం పోస్టు ఇప్పించాలని, తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. దర్బార్‌లో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదర్‌స్వామి, ఎస్ వో రా జేకుమార్‌తో పాటు వివిధ వి భాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ మృతి

కృష్ణ కాలనీ, జూలై 1: జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీకి చెందిన గుంటి సమ్మక్క (48) ఇంట్లో ఉరేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. సమ్మక్కకు వివాహమై విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి తన అన్న గుంటి పోచయ్య ఇంట్లో నివాసముంటున్నది. ఒంటరి జీవితంతో తరుచూ మానసిక వేదనకు గురయ్యేది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

అర్జిదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ములుగు, భూపాలపల్లి కలెక్టర్లు దివాకర, రాహుల్ శర్మ
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్ : ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

ములుగు రూరల్ : మేడారం బిల్లులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టర్ దశరథ్

ములుగు రూరల్ /భూపాలపల్లి రూరల్, జూలై 1: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కారం చూపాలని ములుగు, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్లు టీఎస్ దివాకర, రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఆయా కలెక్టరేట్లలో జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ములుగు జిల్లాలో రెవె న్యూ 29, కోర్టు కేసులు 5, ఉపాధి 6, ఇతర శాఖలకు 23 దరఖాస్తులు ప్రజల నుంచి రాగా కలెక్టర్ స్వయంగా వాటిని స్వీకరించి వివరాలు తెలుసుకున్నారు. మేడా రం బిల్లులు మంజూరీ చేయాలి కోరుతూ పలువురు కాంట్రాక్టర్లు కలెక్టర్‌కు వినతితం ఇచ్చారు. ప్రజావాణిలో ఎక్కువగా భూ సమస్యలు వస్తున్నందున రెవెన్యూ అధికారులు బాధ్యయుతంగా పనిచేయాలన్నారు. భూ సర్వే అధికారులు సర్వే చేసి వదిలివేయకుండా దశల వారీగా సర్వే నిర్వహించి కాస్తులో ఒకరు, పట్టాకు ఒకరు ఉండి గొడవలు ఉన్నట్లయితే భూమి వద్దకు వెళ్లి పరిశీలించి పూర్తి సర్వే చేసి నోటీసులను అందించాలన్నారు. నిబంధన ప్రకారం ఎవరి భూమి అని తేలితే వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజలు తరుచూ జరిగే ప్రజావాణికి రాకుండా చూసుకోవాలన్నారు. సర్వే చేసిన అనంతరం సంబంధిత కాఫీలను తనకు చూపించాలని ఆదేశించారు. భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ సమస్యలపై 72 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వాటి పరిష్కారానికి ఆ యా శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి నుంచి జిల్లాకు వచ్చిన దరఖాస్తులు వారం రోజుల్లో పరిష్కరించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు వారి కార్యాలయల్లో ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించుకోవాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు నిర్దేశించిన సమయానికి హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు వెంకటేశ్వర్లు, శ్రీజ, మహేందర్‌జీ, ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

జిల్లా రవాణా శాఖ అధికారి సంధాని

గణపురం, జూలై 1 : రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రవాణా శాఖ అధికారి సంధాని అన్నారు. సోమవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో విద్యార్థులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించే అంశాలపై ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులు నడిపితే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా టాటా మ్యాజిక్‌లో విద్యార్థుల తరలింపును ప్రోత్సహించొద్దన్నారు. కనీసం 5 ఏళ్ల అనుభవం ఉండి హెవీ లైసెన్స్ ఉన్న డ్రైవర్లనే విధుల్లో చేర్చుకోవాలని సూచించారు. స్కూల్ బస్సులకు ఎలాంటి ప్రమాదాలు జరిగినా డ్రైవర్, సంబంధిత యాజమాన్యంపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కును ఏర్పాటు చేయాలన్నారు.

బాల కార్మికులు కనిపిస్తే సమాచారమివ్వాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్, జూలై 1 : అధికారులు సమన్వయంతో పని చేసి ముస్కాన్- X కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ –Xపై సంబంధిత అధికారులతో సమావేశం, గోడ పత్రికలను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్‌లో పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బందితో జిల్లాలో భూపాలపల్లి, కాటారం సబ్ డివిజన్ పరిధిలో రెండు టీమ్‌లు ఏర్పాటు చేసి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. బాల కార్మికులను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారికి అప్పగించడం, స్టేట్ హోమ్‌కు పంపించనున్నట్లు ఎస్పీ చెప్పారు. చిన్న పిల్లలతో ఎవరైనా బిక్షాటన, వెట్టిచాకిరీ చేయించినా క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. బాల కార్మికులు కనిపిస్తే 1098, డయల్ 100కు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్ పోలీస్ నోడల్ ఆఫీసర్, డీఎస్పీ నారాయణనాయక్, సీడబ్ల్యూసీ చైర్మన్ దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కొమురయ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద, ఇన్‌స్పెక్టర్లు రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

పోలీసులు జవాబుదారీగా వ్యవహరించాలి

పోలీసులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్‌లో బాధితుల నుంచి 19 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదులపై విచారణ జరిపి, సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమశాఖ సీనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు

ఉత్తర్వులు జారీ చేసిన ములుగు కలెక్టర్

ములుగు, జూలై 1 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయ మాదవద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గత నెల 26న ములుగు జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించిన జిల్లా సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్‌పై కలెక్టర్ టీఎస్ దివాకర సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు ప్రభుత్వ దవాఖాన నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.30 వేలు విడుదల చేసింది. కార్యక్రమంలో పాల్గొనే ఉన్నతాధికారులు ధరించేందుకు 20 టీషర్ట్‌లతో పాటు 20 క్యాప్‌లను ప్రభుత్వం సరఫరా చేయగా కలెక్టర్ వీటిని సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించి కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. దీంతో డీడబ్ల్యూవో స్వర్ణలత లెనినా టీషర్ట్‌లు, క్యాప్‌లతో పాటు రూ.30వేల నగదును కార్యక్రమ నిర్వహణకు నాగేంద్రకు అప్పగించారు. ర్యాలీ సందర్భంగా టీషర్టులు, క్యాపులు సమయానికి అందించలేదు. అతేకాకుండా ర్యాలీలో పాల్గొన్న చిన్నారులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేయడంలోనూ విఫలమయ్యాడు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో డీడబ్ల్యూవో విచారణ చేపట్టారు. వాటిని మరుసటి రోజు 27న నాగేంద్ర డీడబ్ల్యూవోకు అందించారు. పూర్తి స్థాయి విచారణ నివేదికను డీడబ్ల్యూవో కలెక్టర్‌కు సమర్పించారు. నాగేంద్ర కార్యాలయ విధులు సక్రమంగా నిర్వర్తించకుండా ఉన్నతాధికారులతో వాదనలకు దిగుతూ విధులకు హాజరుకాకుండా సంతకాలు చేశాడని, క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదించారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ నాగేంద్రను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బస్టాండ్‌లో ఆర్టీసీ ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎం తనిఖీ

ఏటూరునాగారం, జూలై 1 : మండల కేంద్రంలోని బస్టాండ్‌ను సోమవారం ఆర్టీసీ ఆర్ఎం భాను ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని మొదటి అంతస్తులో నిర్మించిన డ్రైవర్లు, కండక్టర్ల రెస్ట్ రూంలను పరిశీలించారు. కొన్ని మార్పులు, చేర్పులపై డీఈఈ భాస్కర్‌కు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. టాయిలెట్స్ నిర్వహణపై ఆరా తీశారు. అదే సమయంలో బస్టాండ్‌కు వచ్చిన బస్సు డ్రైవర్లు, కండకర్లతో ప్రయాణికుల రద్దీపై మాట్లాడారు. వారి వెంట కంట్రోలర్ సత్తయ్య, తదితరులు ఉన్నారు.

ఐటీడీఏ ఎదుట బైఠాయించిన గిరిజనులు

ఇండ్ల స్థలాలు కేటాయించాలి

ఏటూరునాగారం, జూలై 1 : మండలంలోని శంకరాజుపల్లికి చెందిన గిరిజనులు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో సోమవారం బైఠాయించారు. విధులకు హాజరయ్యేందుకు కార్యాలయానికి వస్తున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు తమ సమస్యలను విన్నవించారు. తమకు ప్రత్యేక గ్రామాన్ని ఏర్పాటు చేయాలని, సమీపంలో ఉన్న అటవీశాఖ స్థలంలో గుడిసెలు వేసుకుంటే అటవీ శాఖ అధికారులు తొలగిస్తున్నారని, ఏజెన్సీ చట్టాలు తమకు ఉపయోగ పడేలా ఐటీడీఏ ద్వారా చూడాలని విన్నవించారు. దీంతో పీవో స్పందించారు. ఎక్కడైనా ఖాళీ స్థలం ఉందో తెలుసుకుంటామని, ఎస్డీసీ, ఆర్డీవోతో చర్చిస్తామన్నారు. ఇక నుంచి ఆరుగురు మాత్రమే వచ్చి తనను ఈ విషయంపై కలవాలన్నారు. కాగా, ఆందోళన కోసం రెండు ట్రాక్టర్లలో కార్యాలయానికి వచ్చిన వారికి చార్జీలు ఇవ్వాలని ఏపీవో వసంతరావును పీవో చిత్రమిశ్రా ఆదేశించారు.

సరుకుల నాణ్యత పరిశీలన

ములుగురూరల్, జూలై 1 : ములుగు మండలం బండారుపల్లి రోడ్‌ని గిరిజన భవన్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ సరుకులను సోమవారం ఏటీడబ్ల్యూ దేశిరామ్ పరిశీలించారు. సరుకులను హాస్టల్‌కు పంపిణీ చేయాలని జీసీసీ మేనేజర్ ఆదేశించారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు.

కేన్ మొక్కలకు రక్షణ కరువు

ధ్వంసమైన కేన్ మొక్కలు

వెంకటాపూర్, జూలై 1 : కేన్ మొక్కలును కాపాడంలో అధికారులు విఫలమయ్యారని కేన్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ డాక్టర్ సుతారి సతీశ్ అన్నారు. మండలంలోని పాలంపేట పరిధిలో సుమారు 43 ఎకరాల కేన్ రక్షిత ప్రాంతం ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ఉన్నతాధికారులు, కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గతంలో 54 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మొక్కలు ఐదు ఎకరాలుగా కుచించుకుపోగా నాటి మంత్రి చందూలాల్, డీఎఫ్‌వో లింగారావు, సబ్ డీఎఫ్‌వో ఆంజనేయులు రెవెన్యూ అధికారులు సాయంతో హద్దులు నిర్ణయించి కందకం తీయించినట్లు చెప్పారు. రామప్ప చెరువు మత్తడి పడుతుండడంతో పంట నీట మునుగుతున్నదని రైతులు ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకోగా వారు మొరంచ వాగులో పిచ్చి మొక్కలు, షీల్ట్‌ను తొలగిస్తున్నారు. దీంతో కేన్ ప్రాంతంలో మొక్కలు తొలగిస్తున్నారని వాటిని కాపాడాలని సతీశ్ కోరారు.

కేటీకే 8 ఇంక్లైన్ ఎస్డీఎల్ వాహనాలు

పూజలు చేస్తున్న భానుప్రసాద్

గణపురం, జూలై 1 : మండలంలోని బస్వరాజుపల్లి గ్రామ శివారు కేటీకే 8ఇంక్లైన్‌కు కొనుగోలు చేసిన ఎస్డీఎల్ వాహనాలకు సోమవారం గని మేనేజర్ భానుప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గని అంతర్భాగంలోకి పనుల నిర్వహణకు వాహనాలను పంపించారు. గని మేనేజర్లు భానుప్రసాద్, రాంబాబు మాట్లాడుతూ ఈ వాహనాలను ఉపయోగించడం వల్ల ఉత్పత్తి మరింత మెరుగవుతుందన్నారు. దీంతో గని పనులు వేగంగా, సమర్థవంతంగా జరిగే అవకాశాలున్నాయన్నారు. అంతేకాకుండా ఖనిజ ప్రొడక్షన్‌లో గణనీయమైన పెరుగుదల సాధ్యమవుతుందని తెలిపారు. కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సులువుగా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ శంకర్, రాజేశ్, ఎస్‌డీఎల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రుణమాఫీ అందరికీ వర్తింపజేయాలి

మహాముత్తారం, జూలై 1 : అర్హులైన అందరికీ రుణమాఫీచేయాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర కార్యదర్శి శోభన్ అన్నారు. సోమవారం స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించి మేనేజర్ తిప్పని సంతోష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమైందని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితిని పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు మల్లయ్య, జిల్లా నాయకులు వాంకుడోత్ గోపి, మండల అధ్యక్ష, కార్యదర్శులు గుండు గున్నక్క, మానేటి కృష్ణస్వామి, రైతులు మానేటి శ్రీను, అజ్మీనా బలరాం, రాజ్లి పాల్గొన్నారు.

బొగతలో పర్యాటకుల సందడి

బొగత జలపాతం వద్ద సోమవారం పర్యాటకులు సందడి చేశారు. వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు తీసుకున్నారు. స్విమ్మింగ్‌పూల్‌లో ఉత్సాహంగా గడిపారు. – వాజేడు

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

కాళేశ్వరం, జూలై 1 : మహదేవపూర్ మండలం అన్నారం సమీప గ్రావిటీ కెనాల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించినట్లు కాళేశ్వరం ఎస్సై చక్రపాణి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రయాణికులు, బాటసారులు ఇచ్చిన సమాచారం మేరకు కాటారం సీఐ నాగార్జున్‌తో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం చింతలపల్లికి చెందిన నైతం శేఖర్ (28) గా గుర్తించామన్నారు. అన్నారంలోని తన అత్తగారింటిని శనివారం రాగా అక్కడ గొడవ జరిగినట్లు తెలిపపారు. దీంతో కెనాల్‌లో పడి చనిపోయాడా ? లేక ఎవరైనా హత్య చేసి కెనాల్‌లో వేశారా అని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని మహదేవపూర్ దవాఖానకు తరలించినట్లు చెప్పారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు, 4మేకలు మృతి

టేకుమట్ల, జూలై 1 : మండలంలోని ద్వారకపేట గ్రామానికి చెందిన గాజు గట్టయ్య తన గొర్రెలను మందలో తోలి ఇంటికి వెళ్లి వచ్చేసరికి మందపై కుక్కలు దాడిచేశాయి. ఈ ఘటనలో 20 గొర్రెలు, 4 మేకలు మృతి చెందగా, 10 గొర్రెల పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుడు తెలిపారు. గాయపడిన గొర్రెలకు మండల పశు వైద్యుడు వివేక్, వీఏ శారద, గోపాల మిత్ర కుమారస్వామి చికిత్స అందించారు.

సబ్ స్టేషన్‌లో వన మహోత్సవం

కాటారం, జూలై 1 : మండలకేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. కాటారం గ్రామ పంచాయతీ సహకారంతో విద్యుత్ శాఖ అధికారులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, ట్రాన్స్ కో ఏడీఈ నాగరాజు, సబ్ ఇంజనీర్ ఉపేందర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాటారం పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, కొమురయ్య పాల్గొన్నారు.

సన్మానాలతో ముగిసిన మండల సభ

ములుగురూరల్, జూలై 1 : ములుగు జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ప్రజాప్రతినిధుల సన్మానాలతో ముగిసింది. ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా గ్రామాల వారీగా సమస్యలపై చర్చించారు. ప్రజాప్రతినిధుల పదవీ కాలం పూర్తి కావస్తున్నందున చివరి సభ కావడంతో అధికారులు ఎంపీపీ, వైస్ ఎంపీపీ దపంతులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

ఉత్పత్తి పెంచేలా అవగాహన కల్పించాలి

భూపాలపల్లి రూరల్, జూలై 1: భూపాలపల్లి ఏరియాలో గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తిని పెంచేలా కార్మికులకు అవగాహన కల్పించాలని ఏరియా జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉత్పత్తి, ఉత్పాదకతపై నెలవారీ సమీక్ష నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. జూన్‌లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 3.49 లక్షల టన్నులు పెట్టుకోగా 2.28 లక్షల టన్నులు సాధించామన్నారు. జూలైలో 2.48 లక్షల టన్నులు లక్ష్యం పెట్టుకోగా లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తి పెంచేలా కార్మికులకు అవగాహన కల్పించాలని, వర్కింగ్ పర్మిషన్ నియమాలు పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. సమావేశంలో కేటీకే ఓసీ-2 పీవో వెంకట్రామిరెడ్డి, ఏజీఎం ఎస్ జ్యోతి, అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం, ఫైనాన్స్ మేనేజర్ జే సురేఖ, డీవైపీఎం బీ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్, కౌంటింగ్‌కు 8 వరకు గడువు

భూపాలపల్లి రూరల్, జూలై 1: జిల్లాలో పదో తరగతి పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు ఈ నెల 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రీ వెరిఫికేషన్ కోసం రూ.వెయ్యి చలానా కట్టి సంబంధిత మెమో, హాల్ టికెట్, దరఖాస్తు ఫారం జత చేసి హెచ్ఎంల సంతకంతో అప్లికేషన్ ఫారంను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. రీ కౌంటింగ్ కోసం రూ.500 చలానా తీసి సంబంధిత ప్రొఫార్మా నింపి, టెన్త్ ఫెయిల్ మెమో జతచేసి హెచ్ఎంల సంతకంతో డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ చాపల్ రోడ్డు, గన్ పౌండ్రి, నాంపల్లి, హైదరాబాద్‌కు జూలై 8వ తేదీలోపు చేరే విధంగా పంపించాలని డీఈవో తెలిపారు.

ఎస్సీ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని నిరసన

ములుగురూరల్, జూలై 1 : క్రైస్తవ మతాన్ని పాటిస్తూ ఎస్సీ కోటా నుంచి వ్యవసాయ శాఖలో ఉద్యోగం పొందిన గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చిలకబత్తిని సుప్రజ్యోతి ఎస్సీ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పస్రా గ్రామానికి చెందిన చల్లా ప్రసాద్ ములుగులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రజ్యోతి పలు ప్రాంతాల్లో ఏవోగా పనిచేస్తూ అమాయక యువకులతో సత్సంబంధాలు పెట్టుకొని వారి వద్ద నుంచి అధిక డబ్బులు డిమాండ్ చేసి ఇవ్వని వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిస్తున్నదని ఆరోపించారు. సుప్రజ్యోతి ఎస్సీ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని ఇటీవల రాష్ట్ర ఎస్సీ కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. విషయం తెలుసుకున్న ఆమె తన, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి దుర్భాషలాడడంతో పాటు బెదిరిస్తుందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఆమె ఎస్సీ సర్టిఫికెట్‌ను రద్దు చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ప్రసాద్ కోరారు.

డీఈవో రాజేందర్ బాధ్యతల స్వీకరణ

భూపాలపల్లి రూరల్, జూలై 1 : జయశంకర్ భూపాలపల్లి డీఈవోగా రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయుల సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా డీఈవోకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

గట్టమ్మ ఆలయ అభివృద్ధికి స్థల పరిశీలన

ములుగురూరల్, జూలై 1 : జిల్లా కేంద్ర పరిధిలోని ఆదిదేవత గట్టమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా సోమవారం దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్, ఎఫ్ఆర్వో శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ గట్టమ్మ ఆలయ అభివృద్ధి కోసం ఎండోమెంట్ శాఖ ఆర్‌వోఎఫ్ఆర్ కింద కలెక్టర్‌ను ఎకరంలోపు స్థలాన్ని కోరినట్లు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు.. స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. నివేదికను డీఎఫ్‌వోకు అందించనున్నట్లు వివరించారు.

పీహెచ్‌సీలో జన ఆరోగ్య సమితి సమావేశం

కాటారం, జూలై 1: కాటారంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రంలో సోమవారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. దవాఖాన ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించడం, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కల పెంపకం, ల్యాబ్‌లో రియేజెస్ట్స్ కొనుగోలు, బయో మెడికల్ పిట్స్ నిర్మాణం, రోగులు కూర్చునేందుకు కుర్చీలు, ఇతర స్టేషనరీ కొనుగోలు చేయాలని తీర్మానించారు. అనంతరం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడికల్ ఆఫీసర్ మౌనికను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఫర్జానా బేగం, సీహెచ్‌వో నిర్మల, స్టాఫ్ నర్సు కృపా పాల్గొన్నారు.

వంగపెల్లి దీక్షను విజయవంతం చేయాలి

కృష్ణకాలనీ, జూలై 1 : ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపెల్లి శ్రీనివాస్ మాదిగ ఈనెల 7న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేస్తున్న దీక్షను మాదిగ కులస్తులంతా విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం అంబేద్కర్ సెంటర్‌లో టీఎస్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ దీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యుద్ధం చేయడానికే శ్రీనివాస్ దీక్ష చేస్తున్నాడన్నారు. బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎస్సీ వర్గీకరణ ఆలస్యమవుతున్నదన్నారు. బీజేపీ నాటి నుంచి దళితుల వ్యతిరేక పార్టీ అన్నారు. ఇప్పటికైనా మాదిగలు, మాదిగల ఉప కులాల బాధలు పట్టించుకొని త్వరగా ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. లేకపోతే టీఎస్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు రేణుకుంట్ల మహేశ్‌మాదిగ, మేకల ఓంకార్, శీలపాకల హరీశ్, నరేశ్, టేకుమట్ల మండల అధ్యక్షుడు రేణకుంట్ల రాము, సమ్మయ్య పాల్గొన్నారు.

రామప్ప చెరువు నీటి విడుదల

వెంకటాపూర్, జూలై 1 : వానకాల పంట కోసం రామప్ప చెరువు నీటిని సోమవారం ఇరిగేషన్ డీఈ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ చెరువు ఒగరు కాలువ ఆయకట్టు 3,100 ఎకరాలు, సోమికాలువ 1,100 ఎకరాలు, బూర్గుకాలువ 400 ఎకరాలు, వీర్లకాలువ 380 ఎకరాలు, కొత్త కాలువ 200 ఎకరాలు మొత్తం 5,180 ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేశామన్నారు. ఏఈ నారాయణస్వామి పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

ములుగురూరల్, జూలై 1 : రైతు భరోసా పథకంపై రైతుల నుంచొ సూచనలు, సలహాలను తీసుకునేందుకు సోమవారం మండలంలోని ఇంచర్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. డీఏవో విజయచంద్ర హాజరై కార్యక్రమ వివరాలను రైతులకు వివరించారు. అనంతరం పలువురు రైతులు 10 ఎకరాల్లోపు ఉన్న రైతులందరికీ రైతు భరోసా కల్పించాలని కోరారు. అదేవిధంగా సాగులో లేని భూములకు పథకాన్ని వర్తించజేయవద్దని చెప్పారు. ఏవో సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ రాములు, సీఈ అనిల్, ఏఈవో హరీశ్ పాల్గొన్నారు.